# విజేతలకు బహుమతులు

**ప్రజాశక్తి- చిత్తూరు అర్బన్:** పోలీసు అమరవీరుల దినోత్సవాన్ని పురస్కరించుకొని ఈనెల 26వ తేదీన పోలీసు కుటుంబాల్లోని విద్యార్థులకు నిర్వహించిన వ్యాసరచన, వక్తృత్వ పోటీల్లో విజేతలకు బుధవారం జిల్లా ఎస్పీ మణికంఠ చందోలు బహుమతులు ప్రదానం చేశారు. ప్రథమ బహుమతిగా రూ.5వేలు, రెండో బహుమతిగా రూ.3వేలు, మూడో బహుమతిగా రూ.2వేలు విద్యార్థులకు ఎస్పీ అందజేశారు.

విజేతలకు బహుమతులు అందజేస్తున్న ఎస్పీ మణికంఠ చందోలు

# ధ(ర)డ

## భలే రేట్లు.. పేదలకేమో పాట్లు..

- పండుగ వేళ.. ధరల మోత
- పేద, మధ్య తరగతిపైనే ప్రభావం
- కొండెక్కిన నిత్యావసరాల రేట్లు
- దిగిరానంటున్న టపాకాయల ధరలు
- భయపడుతున్న జనాలు

పండుగొచ్చింది.. పిల్లలకేం తీసివ్వాలి.. ఏం కొనలి.. ఏం తినాలి.. అన్న ప్రశ్నలు పేద, మధ్య తరగతి కుటుంబాలను సంధిస్తున్నాయి. అసలే పేదరికం ఆపై ధరల మంట.. ఏ వస్తువు కొనాలన్నా షాక్ కొట్టే రేట్లే. టపాకాయలు, నూతన దుస్తుల ధరలు కొండెక్కి అస్సలు దిగిరాన్నంటున్నాయి. ఇంట్లో పిల్లల మారం చేస్తుంటే కోరింది తీసివ్వలేక.. పండుగ వేళ పస్తులు ఉంచలేక కోర్కెలు తీర్చే నాన్న కుంగిపోతున్నాడు. అడిగింది వండి పెట్టే అమ్మ ఆందోళన చెందుతోంది.

ఉప్పు పప్పు నుండీ అన్ని రకాల కూరగాయాల ధరాలు పెరిగాయి. మేలు రకం ఉప్పు కిలో కోసం 35 నుంచి 40 కేజి కందిపప్పు రూ. 100 పై మాటే.. వంట నూనెలు లీటరు రూ. 120 ఇలా అన్ని రకాల నిత్యావసర వస్తువులు ఆకాశాన్ని అంటుతున్న వేల పండుగ పూట చుట్టాలు, ఇరుగు పొరుగువారిని పిలిచి కనీసం పప్పున్నం పెడదామన్నా కుదరని పరిస్థితి. దీపావళి అంటే గుర్తొచేది పిండి వంటలు, అరెసెలు.. తెల్లబెల్లం కేజీ రూ.70లు, చెక్కర కిలో రూ.65లు, ఇక కూరగాయల విషయం చెప్పన్నక్కర లేదు. ఉల్లి, వెల్లులి కొండెక్కి కూర్చొన్నాయి. వీటిని కూరల్లో వాడకం తగ్గిపోయింది. కేజి ఉల్లి రూ.60, వెల్లులి కేజి రూ. 400లు వెల్లులి ధర గత ఐదు నెలలుగా ఏమాత్రం తగ్గడం లేదు. కొందరైతే రెడీమెండ్ వెల్లుల్లి పేస్టులను వాడుతున్నారంటే పరిస్థితి ఎంత దారుణంగా తయారైందో అర్థం చేసుకోవచ్చు.

ఈ దీపావళి పెరిగిన నిత్యావసరాల ధరలతో పగలే చుక్కలు చూపెడుతున్నాయి. పేద, మధ్యతరగతి జీవితాల్లో దీపావళి కాంతుల గతి దేవుడెరుగు.. చీకట్లు కమ్ముకున్నాయని చెప్పకతప్పదు. దీపావళి పండుగ వేళ సామాన్య, మధ్య తరగతి ప్రజలలో పండుగ వాతావరణం కనిపించడం లేదు. నిత్యావసర వస్తువుల ధరలు, నూనెల ధరలు తగ్గుతాయని భావిస్తే అందుకు భిన్నంగా కూరగాయల ధరలు ఆకాశాన్ని తాకడం ప్రతి ఒక్కరికీ షాక్‌కు గురిచేస్తోంది. ఇప్పటికే కూరగాయల ధరలు విపరీతంగా పెరిగి కొనుగోలు చేయాలంటేనే ప్రజలు ఇబ్బంది పడుతుంటే మరింత కొండెక్కి కూర్చొన్నాయి..

### పేలుతున్న టపాసుల రేట్లు

పేలకనే తుస్సుమటున్న టపాసులు.. రెండు వేలు తీసుకెళ్ళినా ఏమాత్రం సరిపోవడం లేదు. పిల్లలు మారం చేస్తున్నాంటూ టపాకాయల దుకాణాలకి వెళ్ళితే వాటి ధరలు వింటే నొర్లెబెట్టాల్సిందే. గిఫ్ట్ బాక్సు కోసం మినిమం రూ.1000 పెట్టాల్సిందే... విడిగా కొందామన్నా రూ.4 నుంచి 5వేలు పెట్టానా చిన్న పాటి సంచినిండా రావడం లేదు. పేద, మధ్యతరగతి ఏడాదికోసారి వచ్చే దీపావళి కాంతుల చూడలేని పరిస్థితి. వీటి ధరలు ఎవరు నిర్ణస్తారో తెలియదు కానీ వేల రూపాయాల్లో ఎంఆర్‌పీలు దర్శనం ఇస్తున్నాయి.

### కొత్త బట్టలు కొనే పరిస్థితి లేదు...

ఒకప్పుడు పండగొచ్చిందటే ఇంటిలోని సభ్యులందరికీ కొత్త బట్టలు కొనాల్సిందే. అయితే నేడు కొత్తకొత్త బ్రాండ్లు మారెట్లోకి వచ్చి ఆకర్షనీయంగా పెద్దపెద్ద షోరూలు ఏర్పాటయ్యాయి. బ్రాండెడ్ షోరాంలో ఒక ఫ్యాంటు షర్టు కొనాలంటే కనీసం రూ.4వేలు ఖర్చు చేయాలి. చీర కొనాలంటే కనీసం రూ.5000 పై మాటే... పండుగ పూట ఇంట్లోని అందరికీ కొనడం కష్టం కావడంతో తల్లిదండ్రులు పిల్లలకు మాత్రమే కొని పెద్దలు పాతబట్టలతోనే సర్దుకుపోవల్సిన దుస్థితి.

### పండుగ వస్తుందంటే భయమేస్తోంది..

**- ఉమాదేవి, గృహిణి**

ప్రస్తుతం ఉన్న ధరలకు పండు వస్తుండంటేనే భయపడాల్సిన పరిస్థితి వచ్చింది. అన్నింటి ధరలు ఆకాశాన్ని అంటుతున్నాయి. ఏం కొనాలన్నా వందల రూపాయలు పెట్టాల్సిందే. గత ఏడాది దీపావళి పండ ఖర్చు రూ.3,500లు అయితే ఈ ఏడాది ఎంత తగ్గించి ఖర్చు చేద్దామన్నా రూ.5వేలు ఖర్చు పెట్టాల్సి వస్తోంది. కూరగాయలు, పప్పులు, నూనెలు, టపాకాయలు, బట్టలు ఇలా అన్ని రేట్లు పెరిగాయి. ఒక్క పిల్లాడికి టపాసుల కోసం రూ. 1000 ఖర్చు పెట్టాల్సి వచ్చింది. ఇలానే ధరలు పెరిగితే మాలాంటి పేద కుటుంబాలు రానున్న రోజుల్లో పండగలు చేసుకొనే పరిస్థితి ఉండకపోవచ్చు.

# తలో చేయి.. వంతెన సరిచేయి..

"పాలకులు పలకరించేరో.. అధికారులు వచ్చి సరిచేసేరో.. అని ఎంత కాలం ఎదురు చూస్తాం.. రండి.. మన ఊరి దారిని మనమే సరి చేసుకుందాం.. తెగిన కల్వర్టును బాగు చేసుకుందాం.. అసలే.. బడి పిల్లలు ఇబ్బంది పడుతున్నారు.." ఇది సోమల మండలం పెద్దఉప్పరపల్లి గ్రామస్తుల మాట.. మాటలే కాదండి.. నలుగురూ కలిసి కల్వర్టు వద్ద రాకపోకలకు ఇబ్బంది లేకుండా సరి చేశారు కూడా.. తల్లిదండ్రులు, విద్యార్థులు కూడా కల్వర్టు పనుల్లో భాగస్వాములైయ్యారు.

**ప్రజాశక్తి- సోమల:** పాలకులు, అధికారులు పట్టించుకోకపోవడంతో గ్రామస్తులు, విద్యార్థుల తల్లిదండ్రులు, బడి పిల్లలే తాత్కాలికంగా కల్వర్టు మరమ్మతులు చేపట్టిన ఘటన సోమల మండలంలో చోటు చేసుకుంది. వివరాల్లోకి వెళితే.. సోమల మండలం పెద్ద ఉప్పరపల్లి, బసవపల్లి మార్గమధ్యంలోని కల్వర్టు ఈనెలలో కురిసిన భారీ వర్షానికి కొట్టుకుపోయింది. ఆ తర్వాత అధికారులు సందర్శించి తాత్కాలిక మట్టిరోడ్డు (డైవర్షన్ రోడ్డు) నిర్మాణం చేయించగా అది కూడా వర్షాలు, వాగు పొంగడంతో పూర్తిగా కొట్టుకుపోయింది. దీంతో రెండు గ్రామాల మధ్య రాకపోకలు ఆగిపోయాయి. రోడ్డు కొట్టుకుపోయి రోజులు గడుస్తున్నా పాలకులు, అధికారులు మాత్రం పట్టించుకున్న పాపానపోలేదు. కల్వర్టు లేకపోవడంతో పెద్ద ఉప్పరపల్లి నుంచి కూత వేటు దూరంలోని గ్రామాలకు వెళ్లాలన్న కిలోమీటర్ల దూరం చుట్టూచుట్టి వెళ్లాల్సిన పరిస్థితి ఏర్పడింది. ఎంతకీ కల్వర్టు నిర్మాణం చేయకపోవడంతో విద్యార్థుల తల్లిదండ్రులు, పిల్లలతో కలిసి శ్రమదానం చేసి పైపులపై మట్టిని నింపి రాకపోకలను కొనసాగిస్తున్నారు. నడిచి వెళ్లేందుకు కనీసం ద్విచక్ర వాహనాలు వెళ్లేందుకు మార్గాన్ని ఏర్పాటు చేసుకున్నారు. ఇకనైనా సంబంధిత అధికారులు, పాలకులు పట్టించుకుని కల్వర్టు నిర్మాణాన్ని చేపట్టాలని గ్రామస్తులు కోరుతున్నారు.

కల్వర్టు ప్రాంతంలోని పైపులు పై మట్టి చదును చేస్తున్న విద్యార్థులు వారి తల్లిదండ్రులు

# ఒకటో తేదీ నుంచి ఉచిత గ్యాస్ సిలిండర్లు

## జిల్లాకు రానున్న మంత్రి రాంప్రసాద్ రెడ్డి

### 48 గంటలలో సబ్సిడీ నగదు బ్యాంక్ ఖాతాలకు చెల్లింపు : జెసి

**ప్రజాశక్తి- చిత్తూరు అర్బన్**

రాష్ట్ర ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు నవంబర్ 1న రాష్ట్ర వ్యాప్తంగా ఉచిత గ్యాస్ సిలిండర్ల పంపిణీ కార్యక్రమాన్ని శ్రీకాకుళం నుంచి ప్రారంభించనుండగా చిత్తూరు జిల్లాలో జిల్లా ఇంచార్జ్ మంత్రి, రాష్ట్ర రోడ్డు రవాణాశాఖ, యువజన క్రీడలశాఖ మంత్రి మండిపల్లి రాంప్రసాద్ రెడ్డి జిల్లా స్థాయిలో పంపిణీ కార్యక్రమాన్ని గుడిపాల మండలం జెడ్పి హైస్కూల్ నుంచి లాంఛనంగా ప్రారంభించనున్నారని జిల్లా జాయింట్ కలెక్టర్ జి.విద్యాధరి పేర్కొన్నారు. బుధవారం జిల్లా సచివాలయంలోని జెసి ఛాంబర్ వద్ద గల సమావేశపు మందిరంలో నవంబర్ 1 నుండి ప్రారంభం కానున్న 'ఉచిత గ్యాస్ సిలిండర్ల పథకం' అమలుకు సంబంధించి గ్యాస్ ఏజెన్సీ ప్రతినిధులతో సమావేశం నిర్వహించారు. జెసి మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం బిపిఎల్ తెల్లరేషన్ కార్డు కలిగి ఆధార్ అనుసంధానం చేసుకున్న వినియోగదారులకు ప్రతి ఆర్థిక సంవత్సరానికి మూడు ఉచిత ఎల్‌పిజి గ్యాస్ సిలిండర్ల పంపిణీకి శ్రీకారం చుట్టిందన్నారు. 2024- 25 ఆర్థిక సంవత్సరానికి సంబంధించి మార్చి 31, 2025 వరకు ఒక గ్యాస్ రీ ఫిల్లింగ్‌కు అవకాశం ఉందని వినియోగదారులు ఆందోళన చెందనవసరం లేదని తెలిపారు. ఖాళీ సిలిండర్ ఉన్నప్పుడు 5 నెలల కాలంలో ఎప్పుడైనా గ్యాస్ సిలిండర్ రీ ఫిల్లింగ్ చేసుకోవచ్చన్నారు. గ్యాస్ సిలిండర్ డెలివర్ సమయంలో బిల్లులో ఉన్న నగదును చెల్లించి సిలిండర్ పొందాలని, సిలిండర్ పొందిన 48 గంటల్లో సబ్సిడీ నగదును వినియోగదారుని బ్యాంక్ ఖాతాకు జమ చేయబడునని తెలిపారు. జిల్లాలో ఈ కార్యక్రమాన్ని సమర్థవంతంగా నిర్వహించేందుకు గ్యాస్ ఏజెన్సీలు పౌరసరఫరాల శాఖతో సమన్వయంతో పని చేయాలన్నారు. జిల్లాలో మొత్తం 5,43,202 తెల్లరేషన్ కార్డులు ఉన్నాయని, ఇప్పటివరకు దీపం కనెక్షన్స్ 2,44,546, ఉజ్వల్ కనెక్షన్స్ 12,268, మొత్తం ఎల్పిజి కనెక్షన్స్ 5,80,297, 47 ఎల్‌పిజి గ్యాస్ ఏజెన్సీలు జిల్లాలో ఉండగా అందులో ఐఓసీ 27, బిపిసి 9, హెచ్‌పిసి 11 కలవన్నారు. సమావేశంలో డిఎస్‌ఓ శంకరన్, డిఎం సివిల్ సప్లై బాలకృష్ణ, గ్యాస్ ఏజెన్సీ నిర్వాహకులు సంబంధిత అధికారులు పాల్గొన్నారు.

ఏజెన్సీ ప్రతినిధులతో మాట్లాడుతున్న జాయింట్ కలెక్టర్

### గుడిపాలలో ఉచిత గ్యాస్ సిలిండర్ల పంపిణీ : ఎమ్మెల్యే గురజాల

రాష్ట్ర ప్రభుత్వ ప్రతిష్టాత్మక సూపర్ సిక్స్ పథకాల్లో ఒకటైన ఏడాదికి మూడు ఉచిత గ్యాస్ సిలిండర్ల పంపిణీ ప్రారంభోత్సవ కార్యక్రమాన్ని నవంబర్ 1న శుక్రవారం గుడిపాల మండల కేంద్రంలో ప్రారంభించనున్నట్లు చిత్తూరు ఎమ్మెల్యే గురజాల జగన్ మోహన్ ఒక ప్రకటనలో తెలిపారు. గుడిపాల ఉన్నత పాఠశాలలో ఉదయం 10 గంటలకు జరిగే కార్యక్రమానికి జిల్లా ఇన్చార్జి మంత్రి ఎం.రాంప్రసాద్ రెడ్డి హాజరై ఉచిత గ్యాస్ సిలిండర్ల పంపిణీ ప్రారంభిస్తారన్నారు. ఎన్నికల్లో ఇచ్చిన హామీ మేరకు అర్హులైన కుటుంబాలకు ఏడాదికి మూడు ఉచిత గ్యాస్ సిలిండర్ల పంపిణీ పథకాన్ని దీపావళి సందర్భంగా ప్రారంభిస్తున్నట్లు చెప్పారు.



# రోగులపై పర్యవేక్షణ ఉండాలి

## జిల్లా సమన్వయ అధికారి డాక్టర్ ప్రభావతి

మాట్లాడుతున్న డిఎం అండ్ హెచ్‌ఓ డాక్టర్ ప్రభావతి

**ప్రజాశక్తి- కార్వేటినగరం :** కార్వేటినగరం సామాజిక ఆరోగ్య కేంద్రాన్ని జిల్లా సమన్వయ అధికారిని డాక్టర్ ప్రభావతి బుధవారం తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ రోగులపై పర్యవేక్షణ ఉండాలని, మెరుగైన వైద్యం అందించాలని సూచించారు. రోగులకు వైద్యులు నిత్యం అందుబాటులో ఉండి చికిత్స అందించాలన్నారు. కార్వేటినగరం నుంచి తిరుపతి, నగరికి వెళ్లకుండా ఇక్కడే వైద్యం అందించాలని తెలిపారు. అనంతరం రికార్డులను, ల్యాబ్‌ను పరిశీలించారు. ఆసుపత్రి పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలని, ఎప్పటికప్పుడు క్లీనింగ్ చేసుకోవాలని తెలిపారు. డాక్టర్లు ఆనందమూర్తి, డాక్టర్ గోపీనాథ్, శృతిభాగ్యం, డాక్టర్ యూసఫ్, డాక్టర్ దివ్య తదితరులు పాల్గొన్నారు.

## రాష్ట్రస్థాయి 'ఖోఖో'కు తీర్థం విద్యార్థిని

**ప్రజాశక్తి- బైరెడ్డిపల్లి**

మండలంలోని తీర్థం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల విద్యార్థిని ప్రత్యూష అండర్ -17 విభాగంలో చిత్తూరు జిల్లా తరపున రాష్ట్రస్థాయి ఖోఖో పోటీలకు ఎంపికైనట్లు ప్రధానోపాధ్యాయురాలు రత్నమ్మ తెలిపారు. పాఠశాలలో 8వ తరగతి చదువుతున్న విద్యార్థిని ప్రత్యూష నవంబర్ నెల 2, 3, 4 తేదీల్లో విశాఖపట్నం అనకాపల్లిలో జరుగనున్న 68వ స్కూల్ గేమ్స్ రాష్ట్రస్థాయి పోటీలలో పాల్గొంటారని తెలిపారు. విద్యార్థి ఎంపిక అవ్వడం పట్ల పాఠశాల వ్యాయామ ఉపాధ్యాయుడు దేవేంద్రను, ప్రత్యూషను ఉపాధ్యాయులు, గ్రామస్తులు అభినందించారు.

# వరద బాధితులకు సాయం

**ప్రజాశక్తి- శాంతిపురం :** ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడును మాజీ ఎమ్మెల్సీ గౌని వారి శ్రీనివాసులు విజయవాడలోని ఆయన నివాసంలో బుధవారం మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా విజయవాడ వరద బాధితుల కోసం సేకరించిన రూ.14,36,000ల చెక్కును ముఖ్యమంత్రికి అందించారు. విరాళాలు ఇచ్చిన వ్యక్తులను ముఖ్యమంత్రి పేరుపేరునా అభినందించారు. అలాగే ముఖ్యమంత్రి సతీమణి నారా భువనేశ్వరమ్మ ఎంతో ఆప్యాయంగా పలకరించారన్నారు. ఎన్ని బాధ్యతలు ఉన్నా కుప్పం పట్ల ఆయన చూపెట్టే ప్రత్యేక శ్రద్ధ అమోఘమని తెలిపారు.

# ఉపాధ్యాయ వృత్తి ఉన్నతమైనది

## యుటిఎఫ్ జిల్లా కార్యదర్శి సరిత



**ప్రజాశక్తి - బంగారుపాళ్యం:** ఉద్యోగికి పదవీవిరమణ తప్పదని జిల్లా యుటిఎఫ్ కార్యదర్శి సరిత అన్నారు. బుధవారం ఉపాధ్యాయులు యోహాన్ పదవీ విరమణ సందర్భంగా వారిని ఘనంగా సత్కరించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ఉపాధ్యాయ వృతి అన్నింటిలోకి ఉత్తమమైనదని, ఉపాధ్యాయులు యోహాన్ ఉపాధ్యాయులుగా, యుటిఎఫ్‌లో సభ్యులుగా, స్కూల్ అసిస్టెంట్‌గా వారి పనిని నిబద్ధతతో నిర్వహించి నేడు పదవీ విరమణ పొందుతున్నారని తెలిపారు. ఆయన పదవీకాలంలో ఉపాధ్యాయ వృత్తికి, యుటిఎఫ్ సంఘానికి ఎనలేని కృషి చేశారని ఆయన కృషిని మరువలేదని అన్నారు. అనంతరం ఆయన్ను ఉపాధ్యాయులు దృశ్యాలతో సత్కరించారు. మాజీ యుటిఎఫ్ సభ్యులు సాంబశివ రవిచంద్ర, మండల కార్యదర్శి మోహన్ రెడ్డి, బాలాజీ పాల్గొన్నారు.

# 117 జీవోను రద్దు చేయాలి: యుటిఎఫ్

**ప్రజాశక్తి- తవణంపల్లి:** మండలంలోని ఐరాల క్రాస్‌రోడ్డు ఎంపీపీ పాఠశాలలో ఆంధ్రప్రదేశ్ ఐక్య ఉపాధ్యాయ ఫెడరేషన్ (యుటిఎఫ్) ఆధ్వర్యంలో బుధవారం సమావేశం నిర్వహించడం జరిగింది. యుటిఎఫ్ ఆవిర్భవించి 50 వసంతాలు పూర్తి చేసుకున్న సందర్భంగా గోల్డెన్ జూబ్లీ ఉత్సవాలను జరుపుకున్నారు. అనంతరం యుటిఎఫ్ జిల్లా అధ్యక్షులు సోమశేఖర్ నాయుడు మాట్లాడుతూ యుటిఎఫ్ ఆవిర్భవించి 50 సంవత్సరాలు పూర్తి చేసుకున్నదని, ఉపాధ్యాయుల సమస్యల పరిష్కారంలో యుటిఎఫ్ ఎల్లప్పుడు ముందుందని అన్నారు. ఈ సందర్భంగా 117 జీవోను రద్దు చేయాలని, ప్రాథమిక పాఠశాలల బలోపేతానికి తగిన చర్యలు తీసుకోవాలని ఆయన కోరారు.ఈ సమావేశంలో మండల యూటీఎఫ్ నూతన కార్యవర్గ ఎన్నికలు జరిగాయి. మండల గౌరవ అధ్యక్షులుగా మునస్వామి, అధ్యక్షులు రాజేష్ కుమార్, ఉపాధ్యక్షులు శేఖరయ్య, మమత, ప్రధాన కార్యదర్శి పెద్దబ్బ రెడ్డి, కోశాధికారి చిరంజీవి, కార్యదర్శులు నిరంజన్ రెడ్డి, అరుణాచలం, గీత, ఆడిట్ కమిటీ కన్వీనర్ వెంకట రమణ, జిల్లా కౌన్సిల్ రాజేష్ కుమార్, పెద్దబ్బరెడ్డి, సురేష్ బాబు, శైలజను ఎన్నుకోవడం జిరగింది. ఈ కార్యక్రమంలో యుటిఎఫ్ నాయకులు మండలంలోని ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

# విద్యార్థుల సమస్యలు పరిష్కరించండి : ఎస్ఎఫ్ఐ

తహశీల్దార్‌కు వినతి పత్రం అందిస్తున్న ఎస్ఎఫ్ఐ నాయకులు

**ప్రజాశక్తి- కుప్పంటౌన్:** విద్యార్థుల సమస్యలను పరిష్కరించాలని కోరుతూ ఎస్ఎఫ్ఐ నాయకులు తహశీల్దార్ చిట్టి బాబుకు బుధవారం వినతిపత్రాన్ని అందజేశారు. అనంతరం వారు మాట్లాడుతూ రాష్ట్రంలో ఎన్డీఏ కూటమి అధికారం చేపట్టి నాలుగు మాసాలు పూర్తి అయిందని, అయినా ఇంతవరకు విద్యార్థుల సమస్యలు పరిష్కారానికి నోచుకోలేదని అన్నారు. ఇప్పటికైనా ప్రభుత్వం వెంటనే స్పందించి ప్రభుత్వం విద్యార్థులకు ఇచ్చిన హామీలను, విద్యారంగంలో ఉన్న సమస్యలను పరిష్కరించాలని కోరారు. అలాగే పెండింగ్‌లో ఉన్న విద్యా దీవెన, వసతి దీవెన బకాయిలను విడుదల చేయాలని, ఇంటర్ విద్యార్థులకు మధ్యాహ్న భోజన పథకం అమలు చేయాలని, సంక్షేమ వసతి గృహాలకు సొంత భవనాలు కేటాయించి, మెస్ చార్జీలు రూ.3000కు పెంచాలని, జీవో నెంబర్ 77 రద్దు చేసి, పీజీ చదివే విద్యార్థులందరికీ ఫీజు రీయంబర్స్మెంట్ అందించాలని, తల్లికి వందనం అమలుపై స్పష్టత ఇవ్వాలని, ప్రకాశం జిల్లా యూనివర్సిటీ నిర్మాణానికి నిధులు కేటాయించాలని, డిగ్రీలో మేజర్, మైనర్ విధానాన్ని రద్దు చేయాలని కోరారు.

# డిప్లొమా కోర్సులకు దరఖాస్తులు

**ప్రజాశక్తి- కుప్పం టౌన్**

ద్రావిడ విశ్వవిద్యాలయంలో డిప్లొమా కోర్సులకు అర్హులైన విద్యార్థుల నుండి దరఖాస్తులను ఆహ్వానిస్తున్నట్లు విశ్వవిద్యాలయ కులసచివులు ఆచార్య కిరణ్ కుమార్ బుధవారం ఓ ప్రకటన ద్వారా తెలిపారు. 2024-25 విద్యా సంవత్సరానికి గాను డిప్లొమా ఇన్ ఫోక్ ఫర్ఫామింగ్ ఆర్ట్స్, డిప్లొమా ఇన్ ట్రైబల్ కల్చర్ అండ్ డెవెలప్మెంట్ కోర్సులలో ప్రవేశాల కొరకు ఇంటర్, డిగ్రీ పూర్తి చేసిన అభ్యర్థుల నుండి దరఖాస్తులను ఆహ్వానిస్తున్నట్లు తెలిపారు. ఈనెల 29వ తేదీ నుండి నవంబర్ 15వ తేదీ లోపల దరఖాస్తులకు అవకాశం ఉందన్నారు. మరిన్ని వివరాలకు ద్రావిడ విశ్వవిద్యాలయ వెబ్ సైట్‌ను సందర్శించవలసినదిగా కోరారు.

# 'బిఆర్ నాయుడు' మన జిల్లా వాసే..!

## దీపావళి' కానుకగా టిటిడి బోర్డు

**ఒప్రజాశక్తి - తిరుపతి బ్యూరో**

తిరుమల తిరుపతి దేవస్థానం నూతన పాలకమండలి అధ్యక్షులుగా టివి 5 ఛైర్మన్ బి.రాజేంద్ర నాయుడును(బిఆర్ నాయుడు) నియమిస్తూ రాష్ట్ర ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసింది. మహామహులు పోటీపడినా తొలినుంచి ఊహించినట్లే బిఆర్ నాయుడునే ఆ పదవి వరించింది. ఓ రకంగా దీపావళి పండుగ 'బిఆర్ నాయుడు' కుటుంబంలో వెలుగులు నింపింది. ఎన్నికలకు ముందు టివి 5లో కూటమి పార్టీలకు అనుకూలంగా కథనాలను, వార్తలను ప్రచురించింది. దీంతో అప్పట్లో జగన్ ప్రభుత్వంలో ఎన్నో నిర్బంధాలను ఎదుర్కొంది. రెండేళ్లపాటు ఈ పదవిలో బిఆర్ నాయుడు కొనసాగుతారు. అయితే టిటిడి ఈవో, ఎండోమెంట్ ప్రిన్సిపల్ సెక్రటరీ, తుడ ఛైర్మన్ ఎక్స్ అఫిషియో సభ్యులుగా ఉంటారు.

### వ్యవసాయ కుటుంబంలో పుట్టి

వ్యవసాయ కుటుంబంలో పుట్టి అంచలంచలుగా ఎదిగి నేడు టిటిడి ఛైర్మన్‌గా బాధ్యతలు స్వీకరిస్తున్న బొల్లినేని రాజగోపాల్ నాయుడు అలియాస్ బిఆర్ నాయుడు చిత్తూరు జిల్లా మారుమూల గ్రామం పెనుమూరు మండలం దిగువ పూనేపల్లిలో జన్మించారు. చిత్తూరు ఐటిఐలో ఫిట్టర్ చేసి అనంతరం హైదరాబాదులో బిహెచ్‌ఇఎల్ లో ఉద్యోగిగా చేరారు. 1973లో విజయలక్ష్మిని వివాహమాడారు. కైకలూరుకు చెందిన విజయలక్ష్మి బీహెచ్‌ఈఎల్‌లో టైపిస్టుగా పనిచేస్తున్న ఆమెను ప్రేమ వివాహం చేసుకున్నాడు. బిఆర్ నాయుడు కుటుంబ నేపథ్యం వారి అన్నదమ్ములు కూడా అందరూ ఉద్యోగస్తులే. కుటుంబం మొత్తం కష్టపడే మనస్తత్వం. దిగువ పూనే పల్లి గ్రామంలో మునస్వామి నాయుడు లక్ష్మమ్మలకు ఆరుగురు సంతానం. ఎన్టీఆర్ హయాం నుంచి టిడిపిలో కీలక పాత్ర పోషించారు. చంద్రబాబుతో ఉన్న అనుబంధం నేటికీ కొనసాగుతుంది. 2007లో అక్టోబర్ రెండో తేదీన టీవీ 5 ఛానల్ ను ప్రారంభించారు .ఎలక్ట్రానిక్ మీడియా రంగంలో 2007లో బి.ఆర్ నాయుడు మనవరాలి పేరుతో శ్రేయ బ్రాడ్కాస్టింగ్ ప్రైవేట్ లిమిటెడ్ టీవీ5 ఛానల్ ను ప్రారంభించి అందరి మన్ననలను పొంది ప్రజాదరణతో ఛానల్ ను మరింత ముందుకు తీసుకెళ్లారు.

## ప్రజలకు దీపావళి శుభాకాంక్షలు

**ప్రజాశక్తి- కుప్పం టౌన్**
కుప్పం పురప్రజలకు రాష్ట్ర ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు, ఎంఎల్‌సి కంచర్ల శ్రీకాంత్, పురపాలక సంఘం కమిషనర్, పురపాలక సంఘం కౌన్సిల్ తరపున దీపావళి శుభాకాంక్షలు తెలియజేశారు. దీపావళి సందర్భంగా ప్రజలు టపాకాయలు కాల్చేటప్పుడు జాగ్రత్తలు తీసుకోవాలని సూచించారు. టపాకాయలు కాల్చిన తరువాత ఇనుప చువ్వలను రోడ్ల మీద వేయరాదని, ఇంటి ఎదుట టపాకాయల వ్యర్థాలను ఎవరికి వారు శుభ్రం చేసుకొని, వ్యర్థాలను పురపాలక వాహనంకు అందించాలన్నారు. పండగ సందర్భంగా ఎలాంటి ప్రమాదాలకు గురి కాకూడదని, పిల్లల పట్ల వారి తల్లిదండ్రులు శ్రద్ధ వహించాలని సూచించారు.

వ్యాసరచన పోటీలలో

## 'సెయింట్ మేరీ'కి మొదటి స్థానం

**ప్రజాశక్తి- బంగారుపాళ్యం :** సైబర్ క్రైమ్ వ్యాసరచన పోటీలలో మండలంలోని సెయింట్ మేరీ ఇంగ్లీష్ మీడియం స్కూల్‌లో 10వ తరగతి చదువుతున్న జిమేహ జబీన్ మండలస్థాయిలో మొదటి బహుమతి గెలుచుకున్నది. జిల్లా స్థాయిలో జరిగిన సైబర్ క్రైమ్ సంబంధించి వ్యాసరచన పోటీల్లో రెండవ బహుమతి గెలుచుకున్నది. చిత్తూరు జిల్లా ఎస్పీ మణికంఠ చందోలు విద్యార్థినిని అభినందించి బహుమతిని అందించారు. ఈ సందర్భంగా విద్యార్థిని సిఐ శ్రీనివాసులు, ఎంఈఓ నాగేశ్వరరావు, ఎంఈఓ 2 రమేష్ బాబు, పాఠశాల ప్రధానోపాధ్యాయురాలు సిస్టర్ అన్పిల్ల, కరస్పాండెంట్, ఉపాధ్యాయులు అభినందించారు.

## కాలువల పరిస్థితిపై ఆరా..

మురుగునీటి కాలువలను పరిశీలిస్తున్న డీఈ శ్రీనివాసులు

**ప్రజాశక్తి -గంగాధరనెల్లూరు :** మండలంలోని తూగుండ్రం గ్రామంలో మురుగునీటి కాలువల పరిస్థితి పై బుధవారం అధికారులు వేర్వేరు చోట్ల పరిశీలించారు. తూగుండ్రం గ్రామానికి చెందిన కొందరు టిడిపి నేతలు గ్రామంలో మురుగునీటి కాల్వల పరిస్థితి చాలా అధ్వానంగా ఉందని ఎంపీడీవో హరి ప్రసాద్ రెడ్డికి ఐదు రోజుల క్రితం విన్నవించారు. ఈ విషయాన్ని కలెక్టర్ దృష్టికి ఎంపీడీవో టెలికాన్ఫరెన్సులో తెలియజేశారు. స్పందించిన కలెక్టర్ తూగుండ్రంలో మురుగునీటి కాలువల పరిస్థితిపై తనకు పూర్తిసారి నివేదిక ఇవ్వాలని ఆర్డబ్ల్యుఎస్ డీఈ శ్రీనివాసులను ఆదేశించారు. దీంతో బుధవారం మండల అధికారులతో కలిసి తూగుండ్రంలో పలుచోట్ల మురుగునీటి కాలువల పరిస్థితి పరిశీలించారు. ఎంపీడీవో హరి ప్రసాద్‌రెడ్డి, తూగుండ్రం సర్పంచ్ శ్రీబాబు, టిడిపి అధ్యక్షుడు నీరజాక్షులురెడ్డి, పంచాయతీ కార్యదర్శి మురళి, ఇంజనీరింగ్ అసిస్టెంట్ యువరాజు పాల్గొన్నారు.

## నీవా నదిని పరిశీలించిన అధికారులు

నీవానది ఏటిని పరిశీలిస్తున్న అధికారులు

**ప్రజాశక్తి -గంగాధర నెల్లూరు:** మండలంలోని మూడు గ్రామాలు వద్ద నీవానది ఏటిని బుధవారం అధికారులు పరిశీలించారు. మండలంలోని కొట్రకోన, ముక్కలతూరు, ఎల్లాపల్లె పంచాయతీల వద్ద గల నీవానది ప్రాంతం నుంచి గత వైసీపీ ప్రభుత్వంలో ఎంత మేరకు ఇసుక తరలించారనే విషయంగా నేషనల్ గ్రీన్ ట్రిబ్యునల్, పొల్యూషన్ కంట్రోల్ అధికారులు పరిశీలించారు. స్థానిక అధికారులు దగ్గర వివరాలు అడిగి తెలుసుకున్నారు. కార్యక్రమంలో ఆర్డీవో శ్రీనివాసులు, తహశీల్దార్ చంద్రశేఖర్ పాల్గొన్నారు.

## ఆరోగ్యం పట్ల శ్రద్ధ చూపాలి

**ప్రజాశక్తి- సోమల:** పాఠశాలల్లో చదివే విద్యార్థులు విద్యతో పాటు ఆరోగ్యం పట్ల కూడా శ్రద్ధ వహించి సరియైన సమయానికి పౌష్టికాహారం తీసుకుంటూ ఆరోగ్యవంతులుగా ఉండాలని ఇరికిపెంట పంచాయతీ వడ్డిపల్లి ప్రాథమికోన్నత పాఠశాల ప్రధానోపాధ్యాయులు సుబ్రహ్మణ్యం కోరారు. మెంటల్ హెల్త్ అవేర్నెస్ డే సందర్భంగా సోమల ప్రాథమిక ఆరోగ్య కేంద్ర వైద్యసిబ్బంది బుధవారం పాఠశాల విద్యార్థులకు యోగ, మెడిటేషన్ మొబైల్ చూడడం వల్ల కలిగే నష్టాలు పౌష్టికాహారం తీసుకోవడం వల్ల కలిగే లాభాల గురించి పూర్తిస్థాయిలో వివరించి వారిచేత యోగ మెడిటేషన్ ఎలా చేయాలో నేర్పించారు. ముఖ్యంగా విద్యార్థులు ఆరోగ్యంగా ఎదగాలంటే చదువు ఆటలతో పాటు వ్యాయామం కూడా ఎంతో అవసరమని ఎంఎల్‌హెచ్‌పి శాంభవి, రోజా తెలిపారు. ఈకార్యక్రమంలో ఏఎన్ఎం గీత, ఆశా కార్యకర్తలు గుణవతి, శోభ పాల్గొన్నారు.

## 'నిబంధనలు పాటించాలి '

**ప్రజాశక్తి- బంగారుపాళ్యం:** టపాకాయల విక్రమంలో నిబంధనలు పాటించాలని ఎస్‌బి ఇన్స్పెక్టర్ భాస్కర్ తెలిపారు. బుధవారం మండల కేంద్రంలోని ప్రభుత్వ ఉన్నత పాఠశాల మైదానంలో టపాకాయల విక్రయ కేంద్రాలను ఆయన పరిశీలించారు. అనంతరం టపాకాయల దుకాణాల యజమానులతో మాట్లాడుతూ నియమ నిబంధనలు పాటించాలని, మైనర్లను దుకాణంలో ఉంచుకోరాదని, దుకాణాల సముదాయాల్లో ఫైర్ సంబంధించిన కార్యకలాపాలు ఏవి చేయరాదని, తరచు పరిసరాలను పరిశీలిస్తూ ఉండాలని సూచించారు. సిఐ శ్రీనివాసులు, పోలీస్ సిబ్బంది, దుకాణదారులు ఫిరోజ్, రాజేంద్ర, కేశవ, అంజాత్ పాల్గొన్నారు.

## రీజనల్ వర్క్‌షాప్ ముగింపు

వర్క్‌షాపులో మాట్లాడుతున్న ప్రముఖులు

**ప్రజాశక్తి- శాంతిపురం:** స్థానిక మండల పరిధిలోని శ్రీశ్రీ పరమహంస యోగానంద విద్యాలయంలో హబ్ అండ్ స్పోక్ అటల్ ఉపాధ్యాయులకు నిర్వహించిన మూడు రోజుల వర్క్‌షాప్ బుధవారం ముగిసింది. ఈకార్యక్రమానికి ముఖ్యఅతిథులుగా, కుప్పం కడ స్పెషల్ ఆఫీసర్ వికాస్ మర్మత్, ఏపీఎస్ ఆర్టీసీ వైస్ చైర్మన్ పిఎస్ మునిరత్నం, కుప్పం మాజీ ఎంపీపీ మాజీ సర్పంచ్ డాక్టర్ వెంకటేష్, కేఈసి హెచ్ఓడి డాక్టర్ జిఎన్.కోదండ రామయ్య, విద్యార్థులు, విద్యాలయ చైర్మన్ గోపాల్ జి.అగర్వాల్, విద్యాలయ ప్రధానోపాధ్యాయులు ఆజాద్ హుస్సేన్ , జిల్లా సైన్స్ ఆఫీసర్ రమణ, అటల్ టింకరింగ్ స్టేట్ టాస్క్‌ఫోర్స్ మెంబర్ షాహినా ప్రవీణ్, ఆంధ్రప్రదేశ్ కౌన్సిల్ ఆఫ్ సైన్స్ అండ్ టెక్నాలజీ భువనేశ్వరి, హేమ, బి.రమేష్ ట్రైనర్స్ పాల్గొని కార్యక్రమాన్ని విజయవంతం చేశారు. అతిథులు మాట్లాడుతూ అటల్ ల్యాబ్ విస్తరణ, ఆవశ్యకత, దాని వల్ల ప్రయోజనాలు వివరించారు. అనంతరం ఈ కార్యక్రమంలో పాల్గొన్న ఉపాధ్యాయులకు ధ్రువపత్రాలు అందజేశారు.

## అసైన్డ్ భూముల రీ వెరిఫికేషన్

రైతుల భూములను తనిఖీ చేస్తున్న తహశీల్దార్

**ప్రజాశక్తి - ఎస్ఆర్ పురం:** మండలంలోని అసైన్డ్ భూములలో ఫ్రీ హోల్డ్‌గా నమోదు చేసిన భూములను తహశీల్దార్ లోకనాథ పిల్లై బుధవారం పరిశీలించారు. మండలంలోని కొత్తపల్లి గ్రామపంచాయతీ, కొత్తపల్లి గ్రామాలలో ఫ్రీ హోల్డ్‌గా నమోదైన భూముల వద్దకు వెళ్లి వాటికి సంబంధించిన రికార్డుల ప్రకారం రైతుల పేర్లన్నీ తనిఖీ చేశారు. వీఆర్ఏలు, రెవెన్యూ సిబ్బంది పాల్గొన్నారు.

## బకాయి జీతాలు ఇప్పించండి..

తల్లీబిడ్డ ఎక్స్‌ప్రెస్ సిబ్బంది ఆవేదన

**ప్రజాశక్తి - బైరెడ్డిపల్లి:** అరవింద సంస్థ ఆధ్వర్యంలో కొనసాగుతున్న తల్లీబిడ్డ ఎక్స్‌ప్రెస్ సిబ్బందికి గత నాలుగు నెలలుగా జీతాలు అందడం లేదని, పండుగ రోజుల్లోనూ పస్తులు ఉండాల్సి వస్తోందని వారు ఆవేదన వ్యక్తం చేశారు. ఈసందర్భంగా వారు మాట్లాడుతూ నెలకు రూ.7,770లు జీతం ప్రభుత్వం నిర్ణయించినా అరవింద సంస్థ నెలనెలా సమయానికి జీతాలు అందడం లేదని, నాలుగు నెలలు అసలు జీతాలు ఇవ్వనేలేదని వాపోయారు. ఇకనైనా ప్రభుత్వం స్పందించి బకాయి వేతనాలతోపాటు నెలనెలా సమయానికి జీతం ఇచ్చేలా చర్యలు తీసుకోవాలని కోరారు.

## పశుపోషణపై అవగాహన

**ప్రజాశక్తి- తవణంపల్లి:** పశు సంవర్ధకశాఖ ఉప సంచాలకులు డాక్టర్ అరిఫ్ ఆధ్వర్యంలో బుధవారం పశువులకు వచ్చే వ్యాధులు, వాటి నివారణ చర్యలు, పశుపోషణలో రైతులు పాటించాల్సిన జాగ్రత్తలను వివరించారు. అలాగే పశువులకు పచ్చిమేతతోపాటు ఎండు గండి, మినరల్ మిక్చర్ వంటి వాడడం వలన పాల ఉత్పత్తి పెరిగి ఆదాయం పొందవచ్చు అని తెలిపారు. కార్యక్రమంలో మండల వ్యవసాయాధికారి జి.ప్రవీణ్, పశు వైద్యాధికారి లావణ్య, మార్కెటింగ్ శాఖ రామూమూర్తి, ఆర్‌బికె సిబ్బంది జ్యోతినాథ్, పాడి రైతులు పాల్గొన్నారు.

విజయం డిగ్రీ కళాశాలలో

## ముందస్తు దీపావళి వేడుకలు

**ప్రజాశక్తి- చిత్తూరు అర్బన్:** స్థానిక విజయం ఆర్ట్స్ అండ్ సైన్స్ కళాశాలలో బుధవారం కళాశాల విద్యార్థులు, అధ్యాపకులు ఘనంగా ముందస్తు దీపావళి సంబరాలు నిర్వహించారు. ఈ సందర్భంగా కళాశాల అధినేత తేజోమూర్తి, అక్డమిక్ డైరెక్టర్ శైలజ మూర్తి విద్యార్థులకు అధ్యాపకులకు దీపావళి శుభాకాంక్షలు తెలిపారు. సాంప్రదాయ దుస్తులతో పాల్గొన్న విద్యార్థులు ప్రదర్శించిన సాంస్కృతిక కార్యక్రమాలు అలరించాయి. దీపావళి పండుగ ప్రాధాన్యతను డాక్టర్ తేజ మూర్తి విద్యార్థులకు తెలియజేశారు.

**కార్వేటినగరం:** స్థానిక శ్రీలక్ష్మీనరసింహ విద్యాసంస్థలో బుధవారం ముందస్తు దీపావళి వేడుకలు ఘనంగా నిర్వహించారు. డైరెక్టర్ దిలీప్ కుమార్ మాట్లాడుతూ మూగ జీవులకు ఇబ్బంది కలుగకుండా, పిల్లలు తల్లిదండ్రుల సంరక్షణలో తగిన జాగ్రత్తలు తీసుకుని దీపావళి పండుగ జరుపుకోవాలని తెలిపారు. కార్యక్రమంలో డైరెక్టర్ వెంకటేష్, ధనంజయ రెడ్డి, పురుషోత్తం, హెచ్ఎం, జమున, కృష్ణవేణి, కిషోర్, నిర్మల, చందు ప్రియ, తల్లిదండ్రులు పాల్గొన్నారు.

## 'గోకులం' పనుల పరిశీలన

**ప్రజాశక్తి- వెదురుకుప్పం:** మండలంలో జరుగుతున్న మినీ గోకులం పనులను, గొర్రెలకు నట్టల నివారణ మందు పంపిణీ కార్యక్రమాన్ని పుత్తూరు పశుసంవర్ధక శాఖ డీడీ గోవిందయ్య పరిశీలించారు. బుధవారం స్థానిక ఎడి కార్యాలయంలో పలు రికార్డులను పరిశీలించారు. పశు సంవర్ధక శాఖ ఏడీ రూపా సుందరీని మినీ గోకులం పనులు, నట్టల నివారణ మందు పంపిణీపై వివరాలు అడిగి తెలుసుకుని సంతృప్తి వ్యక్తం చేశారు. రైతులందరికీ ప్రభుత్వ పథకాలు అందేలా ప్రణాళికలు సిద్ధం చేయాలని ఆయన సూచించారు. ఆయన వెంటన పచ్చికాపల్లం పశు వైద్యాధికారి రాజేష్, సిబ్బంది పాల్గొన్నారు.

సమావేశంలో మాట్లాడుతున్న డిడి గోవిందయ్య

## 3,4 తేదీల్లో యుటిఎఫ్ స్వర్ణోత్సవ సంబరాలు

- జిల్లా ప్రధాన కార్యదర్శి మణిగండన్

**ప్రజాశక్తి-విజయపురం(నగిరి)**
నవంబర్3, 4వ తేదీల్లో పూతలపట్టులో నిర్వహించనున్న యుటిఎఫ్ స్వర్ణోత్సవ సంబరాలు, 17వ జిల్లా మహాసభలను విజయవంతం చేయాలని జిల్లా ప్రధాన కార్యదర్శి మణిగండన్ కోరారు. అందరూ ఉపాధ్యాయులు పాల్గొనాలని కోరారు. నగరి ఓం శక్తి గుడి నుంచి టవర్ క్లాక్ వరకు ర్యాలీ చేపట్టారు. నగరి, నింద్ర, విజయపురం మండలాల మహాసభలు జిల్లా సహాధ్యక్షులు పిఆర్ మునిరత్నం అధ్యక్షతన నిర్వహించారు. మూడు మండలాల్లో కౌన్సిల్ నిర్వహించి మండలాల నూతన కమిటీని ఎన్నుకున్నారు. ఈ సమావేశంలో రాష్ట్ర కౌన్సిలర్ ఎస్పీ బాషా, జిల్లా కార్యదర్శి పార్థసారథి, రచనల కమిటీ కన్వీనర్ బాలాజీ, కమిటీ సభ్యులు వెంకటేష్, రవీంద్రబాబు, సీనియర్ నాయకులు చంద్రయ్య, కుప్పరాజు, మండలాల అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

## మండలాభివృద్ధికి కలిసి పనిచేద్దాం..

జెడ్‌పిటిసి దామోదర్ రాజు

**ప్రజాశక్తి- చౌడేపల్లి:** ప్రజాప్రతినిధులు, అధికారులు అందరం మండల అభివృద్ధికి కలిసి పనిచేద్దామని జడ్పిటిసి నడింపల్లి దామోదర్ రాజు, ఎంపీపీ గాజుల రామ్మూర్తి, వైస్ ఎంపీపీలు నరసింహులు యాదవ్, సుధాకర్ రెడ్డిలు కోరారు. బుధవారం స్థానిక పరిపాలన భవనంలో గాజుల రామ్మూర్తి అధ్యక్షతన సర్వసభ్య సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అధికారులు స్థానిక ప్రజాప్రతినిధులు సమన్వయంతో పనిచేసి మండలాన్ని అభివృద్ధి పథంలో నడిపిస్తూ ప్రజలకు అన్ని రకాల మౌలిక సదుపాయాలు కల్పించాలన్నారు. ఈ సర్వసభ్య సమావేశానికి అటవీ శాఖ, ఆర్టీసీ, ఎక్సైజ్ శాఖ అధికారులు రాకపోవడంతో వారికి మెమోలు ఇస్తామని ఎంపీడీవో లీలా మాధవి తెలిపారు. అనంతరం ఆయా శాఖల అధికారులు వారి పనితీరును సభలో వివరించారు. పిఆర్ఏఈ జగన్మోహన్, సర్పంచుల సంఘ అధ్యక్షులు కృష్ణారెడ్డి, మండలంలోని అన్ని శాఖల అధికారులు, సర్పంచులు, ఎంపీటీసీ సభ్యులు, సచివాలయ పంచాయతీ కార్యదర్శులు పాల్గొన్నారు.

## జూనియర్ కళాశాలలో స్వచ్ఛత సేవ

**ప్రజాశక్తి- చిత్తూరు అర్బన్:** బొమ్మసముద్రం ప్రభుత్వ జూనియర్ కళాశాలలో బుధవారం స్వచ్ఛతాహి సేవ కార్యక్రమంలో భాగంగా ఎన్ఎస్ఎస్ యూనిట్ ఆధ్వర్యంలో కళాశాల ప్రాంగణాన్ని క్రీడా స్థలాన్ని శుభ్రం చేసి చెట్లను నాటే కార్యక్రమం చేయడం జరిగింది. ఈ సందర్భంగా కళాశాల ప్రిన్సిపాల్ హరిచంద్ర శేఖర్ మాట్లాడుతూ కాలుష్య నివారణ కోసం ప్రతి ఒక్కరూ కృషి చేస్తూ ప్రతి మంచి సందర్భంలో ఒక చెట్టును నాటడం ద్వారా సమాజ హితం కోసం, మంచి ఆరోగ్యం కోసం కృషి చేయాలని కోరారు. విశ్రాంత ప్రధానోపాధ్యాయులు సుబ్రహ్మణ్యం రెడ్డి 50 చెట్లను కళాశాలలో నాటడానికి సంకల్పించి ఈ కార్యక్రమానికి నిర్వహించినట్లు తెలిపారు. ప్రోగ్రామ్ ఆఫీసర్ శ్రీహర్ష మాట్లాడుతూ చెట్లను సంరక్షించుకునే బాధ్యతను ప్రతి ఒక్కరూ స్వచ్ఛంధంగా తీసుకోవాలని, ప్లాస్టిక్ వినియోగాన్ని తగ్గించుకోవాలని కోరారు. ఈ కార్యక్రమంలో డాక్టర్ బత్తయ్య, రెడ్డప్ప, జ్యోతి, సెల్వి, ప్రసన్న పాల్గొన్నారు.

మొక్కలు నాటుతున్న కళాశాల ప్రిన్సిపాల్

## చవనాపల్లిలో 'పొలం పిలుస్తోంది'

వెదురుకుప్పంలో

**ప్రజాశక్తి- వెదురుకుప్పం:** మండలంలోని తార్లబైలు రెవెన్యూ గ్రామం, చవనాపల్లి గ్రామంలో పొలం పిలుస్తోంది కార్యక్రమం జిల్లా వ్యవసాయాధికారి జె.మురళీకృష్ణ ఆధ్వర్యంలో నిర్వహించడం జరిగింది. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రతి మంగళ, బుధవారాలు వ్యవసాయశాఖ సిబ్బంది పొలంబాట పట్టి రైతులకు సాంకేతిక పరిజ్ఞానం అందించి, పంటల సాగు ఖర్చులు తగ్గించి అధిక ఆదాయం పొందేలా సాంకేతిక పద్ధతులపై రైతులకు అవగాహన కల్పిస్తున్నట్లు తెలిపారు. ఎప్పటికప్పుడు క్షేత్ర ప్రదర్శనలు నిర్వహించి అక్కడికక్కడే రైతుల సందేహాలను నివృత్తి చేయాలని సిబ్బందికి సూచించారు. రైతులు రసాయన ఎరువుల వాడకం తగ్గించి, ప్రకృతి వ్యవసాయ పద్ధతులను అవలంభించి మంచి నాణ్యమైన దిగుబడిని పొందాలని సూచించారు. మల్బరీ తోటలను సందర్శించి రైతులకు సూచనలు అందజేశారు. మండలం వ్యవసాయ అధికారి వనిత, వెటర్నరీ అధికారి రాజేష్, చవట గుంట వ్యవసాయ సహకార సంఘం సీఈఓ, సిరికల్చర్ ఆఫీసర్, రైతు సేవా కేంద్రాల సిబ్బంది, ప్రకృతి వ్యవసాయ సిబ్బంది, గొడుగు చింత సర్పంచ్ నక్క బాబు, పెరుమాళ్ళపల్లి సర్పంచ్ శశి ఆనంద రెడ్డి, మాజీ మండల పార్టీ అధ్యక్షుడు మురళి మోహన్, రైతులు పాల్గొన్నారు.

సంతూరు గ్రామంలో

**శాంతిపురం:** మండల పరిధిలోని మఠం గ్రామ పంచాయతీ సంతూరు గ్రామంలో బుధవారం పొలం పిలుస్తోంది కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో మండల వ్యవసాయ అధికారి జి.అప్పోజి మాట్లాడుతూ అధునాతన, సాంకేతిక ప్రకృతి వ్యవసాయంపై అవగాహన కల్పించారు. పంటలలో చీడపీడల నివారణ కొరకు తీసుకోవాల్సిన చర్యలు గురించి రైతులకు వివరించారు. జీరో బడ్జెట్ నేచురల్ ఫార్మింగ్, ప్రతి రైతు కుటుంబంలో పెరటి తోటలు పెంచకోవడం చాలా అవసరమని రైతులకు తెలిపారు. అనంతరం సొంతూరు గ్రామం వద్ద పండించిన పలు రకాల పంటలను అధికారులు పరిశీలించారు. రైతు సేవాకేంద్రాల సిబ్బంది, మండల ఉద్యానశాఖ అధికారి, జెడ్‌బిఎన్ఎఫ్ సిబ్బంది, రైతులు పాల్గొన్నారు.

శాంతిపురంలో

## నిరక్ష్యరాస్యత నిర్మూలనకే 'ఉల్లాస్'

**ప్రజాశక్తి -సోమల:** స్వయం సహాయ సంఘాలలోని నిరక్షరాస్యులైన సభ్యులందరినీ అక్షరాస్యులుగా చేయడంతో పాటు డిజిటల్ అక్షరాసులుగా చేయాలనేదే ప్రభుత్వ ధ్యేయమని ఏపిఎం శివ పేర్కొన్నారు. బుధవారం స్థానిక వెలుగు కార్యాలయంలో విలేకరులతో మాట్లాడుతూ ప్రస్తుత కాలానికి అనుగుణంగా సంఘ సభ్యులు అందరినీ అక్షరాస్యులుగా చేయడంతో పాటు డిజిటల్ లావాదేవీలలో కూడా పరిజ్ఞానాన్ని పెంపొందించాడానికి రాష్ట్ర ప్రభుత్వం ఉల్లాస్ పేరుతో ప్రణాళికలు అమలు చేయనుందని, రానున్న మూడు సంవత్సరాలలో నిరక్షరాస్యులు అందరినీ అక్షరాస్యులుగా తీర్చిదిద్దాలని జిల్లా కలెక్టర్ నుంచి లక్ష్యాలు నిర్దేశించారని తెలిపారు. ఇందులో భాగంగా ఈ మొదటి విడతలో మండలంలోని స్వయం శాఖ సంఘాలలో 340 మందిని లక్ష్యంగా ఇచ్చారని వీరందరికీ వచ్చే ఏడాది మార్చి మోసం లోపల అక్షరాస్యులు చేయడంతో పాటు డిజిటల్ లావాదేవీల పైన సంపూర్ణ అవగాహన కల్పించనున్నామని తెలిపారు. ఈ అభ్యాసకులకు ప్రతిరోజు సులభతర పద్ధతిలో విద్యనభ్యసించేలా లక్ష్యాలు ఇచ్చారని, గ్రామంలోని అందరికీ అనుకూలమైన ప్రదేశంలో అనుకూల సమయంలో ప్రతిరోజు వీరికి శిక్షణ ఉంటుందని స్పష్టం చేశారు. దీని కొరకు ప్రతి పదిమందికి ఒక వాలంటీర్‌ను కూడా ఇదివరకే ఎంపిక చేశామని, ఈ వాలంటీర్లు స్వచ్ఛందంగా సేవలందించడానికి ముందుకు వచ్చారని తెలిపారు. ఈ వాలంటీర్లకు నవంబర్ 5వ తేదీ మండల స్థాయిలో శిక్షణ ఉంటుందని తెలిపారు. ఈకార్యక్రమం మొత్తాన్ని ఎంపీడీవో, ఏపిఎంల పర్యవేక్షణలో నిర్వహిస్తారని, వయోజన విద్యాశాఖ వారు సాంకేతిక సహాయ సహకారాలు అందిస్తారని తెలిపారు. ప్రభుత్వం ఎంతో మంచి ఉద్దేశంతో ప్రవేశపెట్టిన కార్యక్రమాన్ని అందరి సహాయ సకరాలతో విజయవంతం చేస్తామని ఏపిఎం శివ స్పష్టం చేశారు.

## సురక్షితంగా దీపావళి జరుపుకోవాలి

డాక్టర్ సోమశేఖర్

**ప్రజాశక్తి- విజయపురం:**
మండలంలో ఆనందదాయకమైన దీపావళిని సురక్షితంగా జరుపుకోవాలంటే ప్రతి ఒక్కరూ బాధ్యతగా ప్రవర్తించాలని డాక్టర్ సోమశేఖర్ తెలిపారు. దీపావళి రోజున మందుగుండు సామగ్రిని కాల్చే సమయంలో ఎటువంటి జాగ్రత్తలు తీసుకోవాలి, ప్రమాదాలు జరిగితే వైద్య నిపుణుల సంప్రదించడం వంటి విషయాలను వివరించారు. పండగ సమయంలో కాలిన గాయాల కేసులు పెరుగుతున్నాయని, జాగ్రత్తలు పాటించడం ద్వారా నివారించవచ్చని చెప్పారు. చిన్న పిల్లలను టపాసులతో ఒంటరిగా వదిలి పెట్టకూడదని, సింథటిక్ కంటే కాటన్ దుస్తులు ధరిస్తే మంచిదని, టపాసులు కాల్చడానికి బహిరంగ ప్రదేశాలను ఎంచుకోవడం ఉత్తమమని వివరించారు. కంటికి ఏమైనా గాయమైతే వెంటనే సంబంధిత వైద్యనిపుణులను సంప్రదించాలని సూచించారు. టపాసులు కాల్చే సమయంలో దగ్గరలో రెండు బక్కెట్ల నీరు ఉంచుకోవడం మంచిదన్నారు. చేతితో టపాకాయలను వెలిగించకుండా జాగ్రత్తలు తీసుకోవాలని సూచించారు. కంటికి గాయమైతే కంటిమీద ఎటువంటి ఒత్తిడి పెట్టకూడదని, దాన్ని ముట్టుకోవడం, నలపడం చేయకూడదని వివరించారు.

## క్రైం న్యూస్

ఆడబిడ్డను కంటే

### అదనపు కట్నం కావాల్సిందే..

భర్తతో ధనలక్ష్మీ (ఫైల్ ఫొటో) ఆవేదన వ్యక్తం చేస్తున్న ఆమె తల్లి

**ప్రజాశక్తి-కుప్పం రూరల్:** ఆడబిడ్డకు జన్మనిచ్చిన కారణంగా అదనపు కట్నం తీసుకురమ్మని వేధించడంతో వివాహిత ఆత్మహత్యకు పాల్పడిన ఘటన కుప్పం మండలం కూర్మానిపల్లి గ్రామంలో చోటుచేసుకుంది. పూర్తి వివరాలు ఇలా ఉన్నాయి. కుర్మానిపల్లి గ్రామానికి చెందిన ధనలక్ష్మికి, పైనాసి గ్రామానికి చెందిన సంతోష్‌తో గత 17నెలల క్రితం వివాహం జరిగిందని బాధితురాలి తల్లి తెలిపారు. కొంతకాలం సజావుగా సాగిన వీరి కాపురం తన కుమార్తె ఆడబిడ్డకు జన్మనిచ్చిన నాటి నుంచి వివాదంగా మారిందన్నారు. తన కుమార్తెను తన భర్తతోపాటు అత్తమామలు, ఆడపడుచు మానసికంగా వేధిస్తున్నారని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. అంతేకాక ఆడబిడ్డకు జన్మనిచ్చిన ధనలక్ష్మిని ఏలుకోవాలంటే 25లక్షల రూపాయలు కావాలని తన అల్లుడు సంతోష్ డిమాండ్ చేస్తున్నట్లు తెలిపారు. ఈ విషయమై పెద్దల ముందు పంచాయితీ నిర్వహించగా, ఈ పంచాయితీలో సంతోష్ తన భార్యపై, అత్తపై అబాండాలు మోపుతూ దూషించడంతో అవమానాన్ని భరించలేక తన కుమార్తె విషయం తాగి ఆత్మహత్యకు ప్రయత్నం చేసినట్టు తెలిపారు. వెంటనే బాధితురాలని మెరుగైన వైద్య చికిత్స నిమిత్తం తమిళనాడు రాష్ట్రం క్రిష్ణగిరికి తరలించామని, బాధితురాలు తమిళనాడు ఆసుపత్రిలో చికిత్స పొందుతూ కొనఊపిరితో కొట్టుమిట్టాడుతున్నట్టు బాధితురాలి తల్లి తెలిపారు. ఈ విషయాలన్నింటినీ తెలియజేస్తూ పోలీసులను ఆశ్రయించామని, ఈ విషయమై పూర్తి విచారణ జరిపి పోలీసులు తమకు న్యాయం చేయాలని కోరుతున్నారు.

### గంజాయి వ్యాపారి అరెస్ట్

**ప్రజాశక్తి-కుప్పం రూరల్:** అక్రమంగా గంజాయి వ్యాపారం చేస్తున్న దంపతులను అదుపులోనికి తీసుకున్నట్టు పట్టణ సిఐ జిటి నాయుడు తెలిపారు. బుధవారం ఆయన మీడియాకు వివరాలను వెల్లడించారు. కుప్పం మండలం గరిగచినేపల్లి గ్రామంలో కిరాణా షాపు నడుపుతున్న చిన్నతంబి అక్రమంగా గంజాయి వ్యాపారం చేస్తున్నట్టు సమాచారం వచ్చిందన్నారు. ఈ మేరకు మండల తహశీల్దార్ చిట్టిబాబు ఆధ్వర్యంలో దాడులు నిర్వహించామన్నారు. ఈ దాడులలో 1.150కేజీల గంజాయిని స్వాధీనం చేసుకోవడంతో పాటు చిన్నతంబిని అతని భార్యను అదుపులోనికి తీసుకున్నట్టు వివరించారు. అతను గత ఐదున్నర సంవత్సరాలుగా గంజాయి వ్యాపారం చేస్తున్నాడని, ఇతనిపై కుప్పం, కర్ణాటక రాష్ట్రం కేజిఎఫ్ పోలీస్ స్టేషన్లలో ఇప్పటికే కేసులు ఉన్నట్లు గుర్తించామన్నారు. వారిపై కేసు నమోదు చేసి రిమాండ్‌కు తరలించినట్లు తెలిపారు.

### రైలు కింద పడి వ్యక్తి దుర్మరణం

**ప్రజాశక్తి- కుప్పం రూరల్:** ఆంధ్ర -తమిళనాడు సరిహద్దు ప్రాంతంలో రైలు ప్రమాదంలో వ్యక్తి దుర్మరణం పాలైన ఘటన చోటుచేసుకుంది. ఘటనా స్థలంలో మృతదేహాన్ని గుర్తించిన స్థానికులు కుప్పం రైల్వే పోలీసులకు సమాచారాన్ని అందజేశారు. వెంటనే ఘటనా స్థలానికి చేరుకున్న రైల్వే పోలీసులు ప్రాథమిక విచారణ చేపట్టి కేసు నమోదు చేశారు. రైలులో ప్రయాణిస్తున్న వ్యక్తి ప్రమాదవశాత్తు జారిపడి మరణించి ఉండవచ్చని రైల్వే పోలీసులు అనుమానం వ్యక్తం చేస్తున్నారు. పూర్తి వివరాలు పోలీసుల విచారణలో తెలియాల్సి ఉంది.

### కేబుల్ వైరు చోరీ

**ప్రజాశక్తి- బైరెడ్డిపల్లి:** మండలంలోని చిన్నపురం గ్రామంలో మంగళవారం రాత్రి గుర్తు తెలీని దుండగులు రైతు సరసమ్మ పొలం వద్ద ఉన్న బోరుకు సంబంధించిన కేబుల్ చోరీ చేశారు. బుధవారం తెల్లవారు జామున పొలం వద్దకు వెళ్లి చూడగా కేబుల్ కట్ చేసి ఉండటాన్ని గమనించి గ్రామంలోని పలువురికి తెలిపారు. తరచూ మండలంలోని వ్యవసాయ పంటపొలాల వద్ద ఉన్న మోటర్లు, కేబుల్ వైర్లు, తదితర వస్తువులు చోరీకి గురైతున్నాయని, వ్యవసాయాన్ని నమ్ముకుని జీవనం సాగిస్తున్న మహిళా రైతుకు చెందిన సొత్తును చోరీ చేసిన దుండగులను పట్టుకుని శిక్షించాలని గ్రామస్తులు కోరారు.

### ద్విచక్ర వాహనాలు ఢీ

ముగ్గురికి గాయాలు

**ప్రజాశక్తి - రామకుప్పం:** మండలంలోని బందార్లపల్లి గ్రామ శివారులలో ఎదురెదురుగా వస్తున్న ద్విచక్ర వాహనాలు ఢీకొని ముగ్గురు వ్యక్తులకు గాయాలు అయిన సంఘటన బుధవారం చోటుచేసుకుంది. స్థానికుల కథనం మేరకు బందార్లపల్లి చెరువు కట్ట సమీపంలో సురేంద్ర, భాస్కర్ రామకుప్పం నుంచి పల్లి కుప్పం వెళ్తుండగా పంద్యాల మడుగు నుంచి రామకుప్పం వైపు వస్తున్న హేమాద్రి ఎదురెదురుగా ఢీకొని తీవ్ర గాయాలయ్యాయి. స్థానికులు హుటాహుటిన 108 వాహనంకు సమాచారం ఇచ్చి కుప్పం పిఈఎస్ ఆసుపత్రికి తరలించారు.

## సురక్షితంగా దీపావళి జరుపుకోవాలి

**డాక్టర్ సోమశేఖర్**

**ప్రజాశక్తి- విజయపురం:** మండలంలో ఆనందదాయకమైన దీపావళిని సురక్షితంగా జరుపుకోవాలంటే ప్రతి ఒక్కరూ బాధ్యతగా ప్రవర్తించాలని డాక్టర్ సోమశేఖర్ తెలిపారు. దీపావళి రోజున మందుగుండు సామగ్రిని కాల్చే సమయంలో ఎటువంటి జాగ్రత్తలు తీసుకోవాలి, ప్రమాదాలు జరిగితే వైద్య నిపుణుల సంప్రదించడం వంటి విషయాలను వివరించారు. పండగ సమయంలో కాలిన గాయాల కేసులు పెరుగుతున్నాయని, జాగ్రత్తలు పాటించడం ద్వారా నివారించవచ్చని చెప్పారు. చిన్న పిల్లలను టపాసులతో ఒంటరిగా వదిలి పెట్టకూడదని, సింథటిక్ కంటే కాటన్ దుస్తులు ధరిస్తే మంచిదని, టపాసులు కాల్చడానికి బహిరంగ ప్రదేశాలను ఎంచుకోవడం ఉత్తమమని వివరించారు. కంటికి ఏమైనా గాయమైతే వెంటనే సంబంధిత వైద్యనిపుణులను సంప్రదించాలని సూచించారు. టపాసులు కాల్చే సమయంలో దగ్గరలో రెండు బక్కెట్ల నీరు ఉంచుకోవడం మంచిదన్నారు. చేతితో టపాకాయలను వెలిగించకుండా జాగ్రత్తలు తీసుకోవాలని సూచించారు. కంటికి గాయమైతే కంటిమీద ఎటువంటి ఒత్తిడి పెట్టకూడదని, దాన్ని ముట్టుకోవడం, నలపడం చేయకూడదని వివరించారు.

## నిబంధనలు పాటించకుంటే కఠిన చర్యలు: సిఐ

**ప్రజాశక్తి- గంగవరం :** జనావాసంలో టపాకాయల దుకాణాలు నిర్వహిస్తే కఠిన చర్యలు తీసుకోవడంతోపాటు కేసులు నమోదు చేస్తామని సిఐ ప్రసాద్ మండల ప్రజలను హెచ్చరించారు. టపాకాయల దుకాణాలను నిర్వహించేవారు ఫైర్ ఆఫీసు, రెవెన్యూ అధికారులు, పోలీసుస్టేషన్‌లో తప్పనిసరిగా పర్మిషన్ తీసుకొని వుండాలని, లేకుండే అంగడిని సీజ్ చేసి దుకాణదారులను అదుపులోకి తీసుకుంటామని హెచ్చరించారు.

## కిక్కిరిసిన టపాకాయల దుకాణాలు

**ప్రజాశక్తి- సోమల:** దీపావళి పండుగ సందర్భంగా మండలంలోని సోమల కందూరు గ్రామాలలో ఏర్పాటు చేసిన టపాకాయల విక్రయ దుకాణాలు టపాకాయల కొనుగోలుదారులతో రద్దీగా కనిపిస్తున్నాయి. చిన్నపిల్లలు యువకులు టపాకాయలు కాల్చేందుకు ఆసక్తి చూపడంతో కొనుగోలుదారులతో దుకాణాలు రద్దీగా కనిపిస్తున్నాయి. అయితే ధరలు టపాకాయల మోత కన్నా అధికంగా ఉండడంతో అమ్మకాలు కాస్త మందకుండిగా సాగుతున్నాయి.

## ఎన్ఎస్ఎస్ విద్యార్థుల 'రన్ ఫర్ యూనిటీ'

**ప్రజాశక్తి - సోమల:** అక్టోబర్ 31వ తేదీ సర్దార్ వల్లభాయ్ పటేల్ జన్మదినం సందర్భంగా ముందస్తుగా మండల కేంద్రమైన ప్రభుత్వ జూనియర్ కళాశాల ఎన్ఎస్ఎస్ విద్యార్థులు, అధ్యాపకులు రన్‌ఫర్ యూనిటీ కార్యక్రమం నిర్వహించారు. కళాశాల నుంచి మార్కెట్ యార్డు వరకు పరుగు నిర్వహించారు. కళాశాల ప్రిన్సిపాల్ గంగాధర నాయుడు మాట్లాడుతూ విద్యార్థులు వల్లభాయ్ పటేల్ జీవితాన్ని ఆదర్శంగా తీసుకోవాలని, ఆయన దేశానికి చేసిన సేవలను గుర్తించి వాటిని తమ జీవితంలో భాగంగా నిర్వర్తించుకోవాలని కోరారు. ఎన్ఎస్ఎస్ కోఆర్డినేటర్ గౌతమ్, విద్యార్థులు, అధ్యాపకులు పాల్గొన్నారు.

# అవినీతికి వ్యతిరేకంగా పోరాడాలి

**బ్యాంకు చైర్మన్ ఏఎస్ఎస్ ప్రసాద్**

**ప్రజాశక్తి- చిత్తూరు అర్బన్:** కేంద్ర విజిలెన్స్ కమిషన్ ఆదేశాల మేరకు సప్తగిరి గ్రామీణ బ్యాంక్ ప్రధాన కార్యాలయం అధికారులు, సిబ్బంది చిత్తూరు నగరంలో మూడు కిలోమీటర్ల వాకథాన్ నిర్వహించారు. అవినీతికి వ్యతిరేకంగా నిర్వహించిన ఈ కార్యక్రమం చిత్తూరులోని సప్తగిరి గ్రామీణ బ్యాంకు ప్రధాన కార్యాలయం నుండి శాఖ వరకు మంగళవారం మూడు కిలోమీటర్ల మేర వాకథాన్ నిర్వహించారు. కార్యక్రమంలో బ్యాంకు చైర్మన్ ఏఎస్ఎస్ ప్రసాద్ పాల్గొన్నారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ బ్యాంకు ఉద్యోగులు, అధికారులు అవినీతికి వ్యతిరేకంగా పోరాడాలని, రోజువారీ కార్యక్రమాల్లో ఎటువంటి అవినీతి ఈ ఆస్కారం లేని విధంగా జాగ్రత్త వహించాలని సూచించారు. బ్యాంకింగ్ రంగంలో పనిచేస్తున్న వారందరికీ అవినీతిరహిత వ్యవహారంలో సాధారణమైనప్పటికీ అత్యంత జాగ్రత్తగా వ్యవహరించాలన్నారు. సప్తగిరి గ్రామీణ బ్యాంకు నిర్దేశించిన వ్యాపార లక్ష్యాన్ని సాధించేందుకు బ్యాంకు ఉద్యోగులు కృషి చేయాలన్నారు. ఈ ప్రయాణంలో ఎటువంటి అవినీతికి ఆస్కారం లేకుండా ఉమ్మడిగా కృషిచేసి జిల్లాలోని అన్నివర్గాల ప్రజల ఆకాంక్షలకు అనుగుణంగా మెరుగైన బ్యాంకింగ్ సదుపాయాలను అందజేస్తున్నామని తెలియజేశారు. కొత్తగా బ్యాంకు ప్రవేశపెట్టిన దీన దయాల్ బంగారు ఆభరణాల రుణ పథకం ద్వారా వెనుకబడిన తరగతుల ఖాతాదారులకు కేవలం 6శాతం వడ్డీకి రుణం మంజూరు చేస్తున్నామని తెలిపారు. ఈ పథకం చాలా విశిష్టమైందని అన్నారు. బ్యాంకు విజిలెన్స్ అధికారి రమణయ్య మాట్లాడుతూ ఈ కార్యక్రమం నిర్వహణకు అనుమతులు ఇచ్చిన మున్సిపల్, పోలీస్ అధికారులకు కృతజ్ఞతలు తెలియజేశారు. జనరల్ మేనేజర్ ప్రభాకరన్, అసిస్టెంట్ జనరల్ మేనేజర్ రామకృష్ణ, అధికారులు సిబ్బంది పాల్గొన్నారు.

# 'డ్రగ్స్‌కు బానిసలు కావొద్దు'

**ప్రజాశక్తి-వెదురుకుప్పం:** యువత డ్రగ్స్‌కు బానిసలు కావొద్దని డాక్టర్ వైఎస్ఆర్ ప్రభుత్వ డిగ్రీ కళాశాల ప్రిన్సిపల్ డాక్టర్ బి అన్నపూర్ణ శారద అన్నారు. మండల కేంద్రంలో ఎన్ ఎస్ఎస్, ఐక్యూఏసీ ఆధ్వర్యంలో మంగళవారం అవగాహన ర్యాలీ చేపట్టారు. ఈ సందర్భంగా ప్రిన్సిపల్ మాట్లాడుతూ డ్రగ్స్ వ్యసనం వల్ల కలిగే దుష్పరిణామాల గురించి విద్యార్థులకు వివరించారు. డ్రగ్స్ వ్యసనం వల్ల శారీరక, మానసిక, ఆర్థికంగా నష్టం వాటిల్లుతుందని, భవిష్యత్తును దెబ్బ తీస్తుందని ఆమె హెచ్చరిం చారు. విద్యార్థులు మత్తు పదార్థాలకు దూరంగా ఉండాలని, ఆరోగ్యం తమైన జీవనశైలిని అలవర్చుకో వాలని సూచించారు. కార్యక్రమంలో ఎన్ఎస్ఎస్ డాక్టర్ సి మంగళ గౌరీ, ఐక్యూఏసీ కోఆర్డినేటర్, డీఆర్సీ కోఆర్డినేటర్ డాక్టర్ సి అరుణ, అధ్యాపక అధ్యాపకేత్ర బృందం ర్యాలీలో పాల్గొన్నారు.

ర్యాలీ చేపడుతున్న విద్యార్థులు, అధ్యాపకులు

# తిలగవతి సేవలు అభినందనీయం

తిలగవతిని సన్మానిస్తున్న ఎంఈవో

**ప్రజాశక్తి-పలమనేరు:** పలమనేరు ఎంపిపి పాఠశాల హెచ్ఎం తిలగవతి సేవలు అభినందనీయం అని ఎంఈవో లీలరాణి, బాల సుందరం అన్నారు. 38ఏళ్లుగా ఉపాధ్యాయ వృత్తిలో పనిచేస్తూ ఉద్యోగ విరమణ పొందుతున్న సందర్భంగా శుభాకాంక్షలు తెలిపారు. మంగళవారం పాఠశాలలో ఉద్యోగ విరమణ సభ ఏర్పాటు చేసి హెచ్ఎం తిలగవతిని పలువురు ఘనంగా సన్మానించారు.

# విస్తృతంగా వాహన తనిఖీలు

**ప్రజాశక్తి-విజయపురం:** మండల పరిధిలో పోలీసులు విస్తృతంగా సోదాలు నిర్వహించారు. గాండ్ల కండ్రిగ చెక్ పోస్ట్ మంగళవారం విజిబుల్ పోలీసింగ్ నిర్వహిస్తూ వాహన తనిఖీలు చేపట్టారు. గంజాయి, నాటుసారా, మద్యం వంటి అక్రమ రవాణా అరికట్టేందుకు ప్రతి పోలీస్ స్టేషన్ పరిధిలో విస్తృత తనిఖీలు నిర్వహించారు. ప్రధాన రోడ్డు మార్గాలు, వాహనాలు తనిఖీలు చేస్తూ రోడ్డు భద్రతా నియమాలు ఉల్లంఘించిన వారికి జరిమానాలు విధించారు. ట్రాఫిక్ నియమాలపై అవగాహన కల్పించారు. ద్విచక్ర వాహనదారులు తప్పనిసరిగా హెల్మెట్ ధరించాలని ఎస్ఐ బలరాం, ఏఎస్ఐ గోవిందరాజులు, హెడ్‌కానిస్టేబుల్ చంగయ్య, జనార్ధన్, కానిస్టేబుల్ దాము, సత్యరాజ్, నరేష్ వాహన తనిఖీలు చేపట్టారు.

వాహన తనిఖీలు చేపడుతున్న పోలీసులు

## సభ్యత్వంతో ఆదరణ: ఎమ్మెల్యే

**ప్రజాశక్తి-బంగారుపాళ్యం:** తెలుగు తమ్ముళ్లకు పార్టీ సభ్యత్వంతో ఆదరణ అని పూతలపట్టు ఎమ్మెల్యే కలికిరి మురళీమోహన్ అన్నారు మంగళవారం మండలంలోని కొదలమడుగు, రాగిమనిపెంట గ్రామాల్లో టిడిపి సభ్యత కార్యక్రమం మండల అధ్యక్షులు జయప్రకాష్ నాయుడు ఆధ్వర్యంలో జరిగింది. ఆయన మాట్లాడుతూ పార్టీ సభ్యత్వానికి వంద రూపాయలు చెల్లించి సభ్యత్వం పొందాలని సభ్యత్వం పొందిన వారు పార్టీలో కీలకంగా పాల్గొని కార్యకలాపాలు చేపట్టాలని ప్రమాదవశాత్తు జరిగిన నష్టానికి ఐదు లక్షల రూపాయల వరకు భీమా ఉంటుందన్నారు. కార్యక్రమంలో మండల ప్రధాన కార్యదర్శి జనార్ధన్ గౌడ్, క్లస్టర్ ఇన్‌ఛార్జ్ ధరణి, సర్పంచులు ప్రకాష్ నాయుడు, మురళి, నాయకులు మహేంద్ర, నాగరాజు గౌడ్, బాలకృష్ణ, శ్రీనివాసులు, చిన్నయ్య తదితరులు పాల్గొన్నారు.

## ఉచిత గ్యాస్‌ని సద్వినియోగం చేసుకోండి

**- తహశీల్దార్ లోకనాథ పిళ్లై**

**ప్రజాశక్తి-ఎస్ఆర్ పురం:** ప్రభుత్వం ఆరు పథకాల అమలులో భాగంగా పేదలకు మూడు ఉచిత గ్యాస్ సిలిండర్లు పథకాన్ని ప్రవేశ పెట్టిందని, ఈ పథకాన్ని సద్వినియోగం చేసుకోవాలని తహశీల్దార్ లోకనాథ పిళ్ళై తెలిపారు. మంగళవారం ఎస్ఆర్ పురం భారత్ గ్యాస్ కార్యాలయాన్ని సందర్శించారు. ప్రభుత్వం మూడు దఫాలుగా ఈ ఉచిత గ్యాస్ సిలిండర్లు ఇస్తుందన్నారు. నవంబర్ 1 నుంచి మార్చి 31వరకు మొదటి విడత, ఏప్రిల్ ఒకటి నుంచి ఆగస్టు వరకు రెండవ విడత, రిజిస్ట్రేషన్ చేసుకున్న వారికి ఒక్కొక్క సిలిండర్ ఉచితంగా ఇస్తారన్నారు. కార్యక్రమంలో గ్యాస్ డీలర్ ఝాన్సీ, భాస్కర్ నాయుడు, సిబ్బంది పాల్గొన్నారు.